# "ఈ బీదరాలిని తల్చుకొంటూ వుండు, ప్రభా!"

శ్రీమతి కమలా గిరిధర్

"ఏమండీ, మీరీ కథ చదివారా?" పత్రిక చేతికిస్తూ అడిగింది ప్రభ.

"ఏం కథ... ఓసో నువ్వు వ్రాశావా?" కొంటెగా చూస్తూ అన్నాడు శివప్రసాద్.

"ఏం? - వ్రాయకూడదేమిటీ! అంతటి విచారం వెళ్లబుచ్చుతున్నారు" అని బుంగమూతి పెట్టింది ప్రభ.

"ఊఁహుఁ అందుక్కాదు; పత్రికా ప్రపంచానికి ఎంత దౌర్భాగ్యం పట్టుకుందా అని..."

"అదిగో చూశారా, అక్కడకూడా మీ అధికృత చూపాలనే మీ తాపత్రయం. అందుకే నేనంటాను, స్వార్థానికి మారుపేరే పురుషుడు".

"చాల్లేద్దూ. అప్పటికి ఆడవాళ్లంతా మహా నిస్వార్థపరాయణులైనట్టు...ఆఁ ఇంతకూ నువ్వేమన్నావ్?"

"ఈ కథలో ఓ ప్రత్యేకతకూడా వుందండీ. అందులోను ఇది మా క్లాసుమేటు వ్రాసింది".

"ఓ, అందుకనే బాగుందంటున్నావ్".

"అదేం కాదులెండి. మీరు ముందు చదవండి చెప్తాను".

"నువ్వు చెప్పేది బావుందికాని, కప్పు కాఫీ యివ్వందే నావల్ల కాదు బాబూ. ఊఁహుఁ కథే నడవదు".

కథకూ కాఫీకి సంబంధం ఏమిటండీ? ఇప్పుడేగా తీసుకున్నారు?"

"నీకు తెలీదులే ప్రభా. ఈమధ్య కొన్ని కథలు వస్తున్నాయి. కాఫీ సేవించకపోతే - బుర్ర బద్దలైపొయ్యే ప్రమాదం కూడా వుంది వాటిల్లో".

"అయ్యో, అయితే తెస్తాల్లెండి" అని నవ్వుతూ రివ్వున వంటగదిలోకి పరుగుతీసింది ప్రభ.

ప్రసాద్ దృష్టిని కథమీదికి మళ్లించాడు. పత్రికలో మొదటి కథపేరు 'ప్రేమార్పణ' — రచయిత్రి 'రమ'. ఈ పేరు ఎక్కడో తను విన్నట్టు జ్ఞాపకం. ఎక్కడ? ఎప్పుడు?...ఆఁ అదే — ఆనాడే — అవును - అప్పుడే తను మర్చిపోగలడా? గుండెల్లో ఏదో పోటు పుట్టింది. మనసులో ముల్లుకర్రపెట్టి దేవినట్లనిపించింది. ఆతురతతో కథ చదవటం మొదలెట్టాడు ప్రసాద్. మొదటి వాక్యంలోనే ఏదో ఆవేశం వున్నట్లు కనిపించింది. భ్రమకాదు, ఎవర్తో అగోచరహస్తం ఛెళ్లున తన చెంప వాయించినట్లు ధ్వనించి అదృశ్యమైపోయింది. ఏమిటీవిచిత్రం. తన మనసులో ఈ కలవర మేమిటీ?... తను చేసిన నేరమేమిటీ?

కథ మంచి రసఘట్టంతో ప్రారంభమైంది. "తప్పకుండా వస్తారు కదూ. మీకోసం నిరీక్షిస్తూవుంటాను" అంటుంది ఒక ప్రియురాలు. "నామీద విశ్వాసం లేదా రమా! నేను నిన్ను మోసం చేస్తానా? అలా చేస్తే మళ్లీ నీ మొహం చూడగలనా? నేను బ్రతకగలనా" అని ఓదార్చి ధైర్యం చెబుతాడు ప్రియుడు. ఇవీ కథలోని మొట్టమొదటి డైలాగ్సు. ఆ తర్వాత కథ సాఫీగా సాగిపోయింది. కథ చదువుతున్నంతసేపూ తను పుస్తకం చదువుతున్నట్టులేదు ప్రసాదుకు. వాస్తవ జీవితాన్ని యధాతధంగా ఛాయాచిత్రం తీసి చూపుతున్నట్లనిపించింది. ఆకథలో యిద్దరి వ్యక్తుల జీవితసారం ఇమిడివుంది. ఆ కథకు ప్రాణం వుంది. ఆ కథలో వున్న వ్యథ, జీవితంలో సుధారస పానానికి నోచుకోని అభాగ్యుల్ని జ్ఞప్తికి తెస్తుంది.

కథ విషాదాంతంగా ముగిసింది. ప్రియుడే తన సర్వస్వంగా నమ్మిన ప్రియురాలిని నిర్దాక్షిణ్యంగా వదిలేసి పారిపోతాడు. ఆమె బ్రతుకు బండలవుతుంది. ఆమె కోర్కెలు నీటి వ్రాతలై, ఆమె వూహలు గాలిమేడలై కూలిపోతాయ్. వెలుగును వెతుక్కొంటూ చీకట్లో కలిసిపోతుంది ఆ అభాగిని. కథలో అసహజత్వానికి ఎక్కడా చోటులేదు. ఆత్మ సమానంగా ప్రేమించిన అబలలను, పడతుల్ని నమ్మించి నాశనంచేసే పిరికి ప్రేమికులు, కర్కశహృదయులు ఎందరులేరు? ఈ ప్రశ్న

తనలో ఉదయించగానే ప్రసాద్ సిగ్గుతో తలవంచుకొన్నాడు. తన మహాపరాధాన్ని తలచుకొని బాధపడటంకన్న, గుండె ఒక్కసారి వెయ్యిముక్కలుగా చీలిపోతే బాగుండుననిపించింది. "నీకు ద్రోహం చేశాను. రమా! ముమ్మాటికి నేను పిరికివాడ్ని" అని తనలో తాను ఎన్నోసార్లు రమకు క్షమార్పణ చెప్పుకున్నాడు. రమ క్షమిస్తుందా తనలాంటి వంచకుడ్ని! మళ్లా మొహమెత్తి చూస్తుందా? ... ఎక్కడుందో పాపంరమ ... ఏమైపోతుందోతను? ... నాకోసం ఎన్ని కష్టాలు?...

ప్రసాద్ స్మృతిపథంలో రమతో గడిపిన మధుర క్షణాలు జ్ఞాపకానికి వచ్చాయి. ప్రసాద్ హృదయం వేగంగా కొట్టుకోసాగింది. ఏదో బాధ, చెప్పరాని ఏదో అనుభూతి అతన్ని పిచ్చివాడినిగా చేశాయి. కళ్లలో నీళ్లు తిరిగాయి. అలాగే కన్నీళ్లు కార్చుతూ ఎంతసేపు అలా ఉండిపోయాడో అతనికే తెలీదు.

"ఏమండోయ్. కథ చదివారా? అదేమిటండీ, కుర్చీలో అలావాలిపోయ్యారు!" అంటూ కాఫీ కప్పుతో దగ్గరికొచ్చింది ప్రభ. భర్తగాన్ని చూసి తను విస్తుపోయింది. "ఇదేమిటీ, ఏడుస్తున్నట్టుందే" అని ప్రసాద్ చుబుకాన్ని పట్టి పైకెత్తింది. ఆశ్చర్యంతో.

ప్రసాదు ఈలోకంలోపడి "ఆఁ ఏమీలేదు. ఏదో జ్ఞాపకం వచ్చి" — అన్నాడు

"నాకు చెప్పరానిదా?"

"అదేంకాదు. అది చెప్తే నన్ను నీవు క్షమించవేమో"

"ఛీ. అదేమిటండీ వింతగా మాటాడుతారూ!"

"మీ స్నేహితురాలెవరోగాని మంచి కథే రాసింది. నూరుపాళ్లు నాకథే"

"మీరుకూడా ఎప్పుడైనా అలాగా ఒక అమ్మాయిని ......"

"అవును ప్రభా, నాజీవితంలో మరపురాని ఘటనఅది. నువ్వు భరించగలిగితే చెబుతా"

"చెప్పండి — నేనేమీ అనుకోను. ఎప్పుడూ మీదాన్నేకదా" అని ప్రభ తొందరచెయ్యడంతో, ప్రసాదు తనగత జీవితాన్ని చెప్పడం మొదలెట్టాడు.

◆ ◆ ◆

ఇప్పటికి పదేళ్లక్రిందటిమాట. నేను గుంటూర్లో బి. ఏ. చదువుతున్న రోజులవి. గుంటూర్లో నాకు బంధువులెవరు లేకపోవటం మూలాన కాలేజి దగ్గరగా ఒకరూమును అద్దెకుతీసుకొని, ఒంటరిగా చదువుకునేవాడ్ని. అప్పటికి నాకెవరూ స్నేహితులు కాలేదు గుంటూర్లో. మనుష్యుల్ని సులువుగా పరిచయంచేసుకొనే స్వభావం నాలో లేకపోవడం ఇతరులతో కలిసిమెలిసి తిరగకపోవడంచేత ఆరు నెలల కాలంవరకు గుంటూరు నాకు క్రొత్తగానే ఉండేది. కాలేజివదిలితే రూము, రూము వదిలితే కాలేజి - యివిరెండే నా ప్రపంచం ... ఎప్పుడైన మరీ విసుగ్గావుంటే షైర్ వెళ్లే వాడ్ని అంతే. నా రూముకు ప్రక్కనే యింటియజమాని వుంటున్నాడు. ఆయన భార్య, ఆయన మేనకోడలు అంతే వాళ్ళ సంసారం. పరంధామయ్య చాల పెద్ద మనిషి. నాతో ఎప్పుడూ సాదరంగా మాటాడేవాడు. అప్పుడప్పుడు నారూమ్ కొచ్చి "ఎప్పుడూ చదువేనా? కాసేపు అలా షైర్ వెళ్లిరా బాబూ" అని నవ్వుతూ హెచ్చరించే వాడాయన. నాకు ఆయన మాటమీద ఎనలేని గౌరవం. ఆయన భార్య రత్తమ్మ కూడా అంత ఉత్తమురాలు. నాకేమైనా కావాల్సివస్తే నిర్భయంగా అడగమని చెప్తుండేది. ఆమెను చూస్తే చనిపోయిన మా మామ్మ నాతో మాట్లాడుతున్నట్లు అనిపించేది. ఆ దంపతులకు పిల్లల్లేరు. మేనకోడలు "రమ"ను చిన్నప్పట్నుంచి చేరదీసి పెంచుకొంటున్నారు. ఆమెకు పద్దెనిమిదేండ్ల వయస్సుంటుంది. సన్నగా వుంటుంది. చామన ఛాయ. తీర్చిదిద్దినట్లు అంగసౌష్టవం. ఆమె ఎంతో ఆకర్షణీయంగా వుంటుంది. ప్రొద్దున్నే నిద్ర లేవగానే ఏదోపని చేసుకొంటూ 'రమ' నాకంటబడేది. ఆ వికసితవదనం చూస్తేనేగాని నాకదోక తృప్తి అనిపించేదికాదు. నాలో నూతనశక్తి, నూతనోత్సాహం ఆవిర్భవించేది. ఎందుచేతనో చెప్పలేను. ఆ దృశ్యం చూడలేకపోయినప్పుడు అమూల్యవస్తువు నేదో పోగొట్టుకున్నట్టు బాధపడేవాడ్ని. రమ నాతో మాట్లాడేదికాదు. నేనామెను చూస్తున్నప్పుడు బదులుగ ఒక్క చిరునవ్వు మాత్రం నవ్వి తుర్రున పారిపొయ్యేది—అంతే. మాదొక మూగభాష.

రమ స్కూల్ ఫైనల్ చదువుతోంది. నాతో పాటు అమె పదిగంటల దాకా చదువుతూ వుండేది. నా గదిలో లైటు ఆర్పివేయడం చూస్తేనేగాని, ఆమె పుస్తకాలు కట్టిపెట్టి పడుకొనేదికాదు. ఆమె పట్టుదలకు నాకు నవ్వొచ్చేది.

రమతో మాట్లాడాలని కోర్కె గాఢం అయ్యే కొద్దీ 'రమ' నాకు దూరంగా వుండిపోతూ వచ్చింది. ఎన్నోసార్లు వాళ్లింటికి వెళ్లి పరంధామయ్యతో మాట్లాడటం జరిగింది. కాని, రమ నన్ను చూసి లోపలికి జారుకునేది. అంతట నాలో వుత్సాహమంతా చల్లారిపోయేది. నన్ను చూస్తే ఏం భయం? చదువుకొన్న స్త్రీలుకూడా మగాళ్ళను చూస్తే అలా భయపడి పారిపోతారెందుకని నాలో నేను విసుక్కునేవాడ్ని.

ఒకనాడు నాగది వూడ్చే పనిమనిషి రాలేదు. దాహం పుట్టింది. కూజాలో నీళ్లులేవు. పరంధామయ్యగారింటికి వెళ్లాను. వాకిట్లోనుంచే "రత్తమ్మగారూ!" అని పిల్చాను. ఆమె పలకలేదు. లోపల్నుంచి జవాబైనా రాకపోవడం నాకు చిరాకు వేసింది. మళ్లీ పిల్చాను. "రమ" సిగ్గుపడుతూ దగ్గర కొచ్చి "ఇంట్లో లేరండీ" అంది మృదువుగా. "నాకు కాసిని మంచినీళ్లిప్పిస్తారా?" అన్నాను నేను ధైర్యంగా ఆమెవైపు చూస్తూ.

రమ లోపలికి వెళ్లి గ్లాసునీళ్లు తెచ్చిచ్చింది. ఆమెతో కొంతసేపు మాట్లాడాలనిపించింది. కాని, ఏం మాట్లాడుతాం అలా భయపడి రమ పారిపోతూంటే?

గ్లాసు ఆమె చేతికిస్తూ "పరంధామయ్యగారు లేరా?" అన్నాను.

"లేరు. పొలానికి వెళ్లారు" అంటూ తిరిగి చూడకుండా లోపలికి పరుగుతీసింది.

ఇంకేమిటీ, రమతో నేను మాట్లాడేది? గుట్టుగా యివతల కొచ్చేశాను. 'రమ'తో స్నేహం చెయ్యాలనే కోర్కమాత్రం నాలో రోజురోజుకు బలీయం కాజొచ్చింది. రమమీద నాకెట్టి దుష్టకోర్కెలు లేవు. కాని, ఆమె నా ప్రక్కగా చేరి ముద్దుగ మాట్లాడుతుంటె వినాలని మాత్రమే నాకుండేది. అంతకంటే మరే వాంఛా లేదు.

రోజులు అలాగే గడిచిపోతున్నాయి. డిశంబరు దాటి జనవరి ప్రవేశించింది. రమలో మాత్రం మార్పు రాలేదు. నేను రెండుమూడు సార్లు ఏదో మిషతో పల్కరించి విఫలుణ్నయ్యాను. ఆమె ముక్తసరిగా సమాధానమిచ్చి జారుకుపోయింది.

ఒకనాడు గదిలో చదువుకొంటూండగా రత్తమ్మగారు వచ్చింది. "చూడు నాయనా, నువ్వేమీ అనుకోకపోతే నేనొక మాటంటాను" అంది.

నేను భయపడిపోతూ, ఏంచేశాను భగవంతుడా అని క్షణం ఆలోచనలో పడ్డాను. దిక్కుతోచక, "చెప్పండి దానికేం" అన్నాను.

"మరేంలేదు నాయనా! మా రమ వొట్టిపిచ్చిది. ఇన్నాళ్లనుంచి నువ్విక్కడుంటే, అది నీతో మాట్లాడ్డానికి భయం చూశావా? దానికి క్లాసులో లెక్కలు కష్టంగా వున్నాయట..." అంటూ ఆగిపోయింది.

నేనందుకొని "దానికేముందీ, నన్నడిగితే చెప్పనూ?" అన్నాను.

"అదే నాయనా, ఆమాటే అన్నా. దానికి వల్లమాలిన సిగ్గు. నామాట వింటేగా. ఇప్పుడు మాత్రం ఒప్పుకుందనా, అబ్బో" అంటూ నవ్వింది రత్తమ్మ.

కూతుర్ని పిల్చి "విన్నావుగా? తెలియని లెక్కలు చెప్పించుకో బాబుదగ్గర" అని నాకప్పగించింది. ఆవేళనుంచి రమ నాగదికి వచ్చి లెక్కలు చెప్పించుకొంటూండేది, నన్నామె "అండీ" అని సంబోధించడం నాకు చిరాకు పుట్టింది. ఒకసారి "నాకు ప్రసాద్ అని తల్లిదండ్రులు పెట్టిన పేరుంది" అన్నాను కోపంగా. పాపం రమ భయపడిపోయి క్రమంగా నన్ను పేరుపెట్టి పిలవడం అలవాటు చేసుకుంది.

మా యిద్దరిమధ్య చనువు ఏర్పడ్డానికి చాలకాలం పట్టింది. రమ స్నేహంతో నేననుకొన్నంత అమాయకురాలు కాదనిపించింది. చలాకీగా మాట్లాడేది. నేనూ ఆమెముందు ఏ విషయం చెప్పడానికీ భయపడేవాడిని కాను. అలా స్నేహం బలపడిపోయింది.

ఇద్దరికీ పరీక్షలైపొయ్యాయి. సెలవుల్లో వూరు వదిలిపోవడానికి నాకు మనసు రాలేదు. కాని, మూడు నెలలు యిక్కడ వుండిపోవడానికి ఒప్పుకుంటాడా నాన్న? ఎందుకంటే ఏం చెప్పడం?

"నేను రేపే వూరు ప్రయాణం, రమా" అని చెప్పాను. రమ మొహంలో కాంతిని కోల్పోయింది. చిరుకోపం ప్రకటిస్తూ, "ఈ వారంరోజులు వుండకూడదేమిటి?" అంది విసురుగా.

"ఇదిగో చూశావా మా నాన్న వుత్తరం. 'ఏవో పనులు' అని వ్రాశాడు. సెలవులవగానే వచ్చేస్తాగా. మరొక సంవత్సరం నీతోనే ఇక్కడ వుంటాను. ఏం రమా! సరేనా?" అని బ్రతిమాలుకొన్నాను. రమకు వుత్తరాలు వ్రాసేట్టు ప్రమాణ

చేసి, తను ఆమెను సంతోషపెట్టి, రైలెక్కి వచ్చేశాను ఆ సంవత్సరం.

◆ ◆ ◆

సెలవుల్లో రమ మూడు ఉత్తరాలు వ్రాసింది. ఎందుచేతనో మూడు మాసాలు నాకు మూడు యుగాలుగా గడిచినట్లనిపించింది. జూన్ నెల మొదట్లోనే గుంటూరుకు ప్రయాణం కట్టాను. 'రమ అందం' సెలవుల్లో ఇనుమడించినట్లు తోచింది నాకు. ఆమెలో మరొక క్రొత్త ఆకర్షణ కనిపిస్తుంది.

ఒకనాడు సాయంత్రం నేనే వెళ్ళి "రమాదేవి గారూ, నాతో మాట్లాడటం చాలించారు, ఎందుకు?" అని ప్రశ్నించాను.

"సీనియర్లో కూడా హాయిగా మాటల్తో కాలం గడపాలనుకున్నారా దొరగారూ" అందామె వ్యంగ్యంగా.

నా చదువుకు డిస్టర్బెన్సు చెయ్యకూడదని ఆమె భావం. ఐతే, రమతో మాట్లాడకుండా నేను చదువగలనా? ఏదో ఒక నెపంతో రమ యింట్లోకి వెళ్ళి మాటల్లో దించేవాణ్ని. అప్పటికీ రమ గ్రహించి "దొరగారు యిక వెళ్ళొచ్చు" అని ఖండితంగా చెప్పేది. ఆ ఆజ్ఞలో నామీద రమకున్న చొరవ తెలిసిపొయ్యేది. నేను మరింకేమి కిక్కురుమనకుండా రూముకు వచ్చేసేవాడ్ని.

రమ నామీద ఈ సంవత్సరం మొదట్నుంచి ఒక విధమైన అధికారం చెలాయించడం చూసి నాకు అత్యానందం కలిగేది. ఆమధ్య ఫ్రెండ్సు బలవంతంతో సిగరెట్టు పీల్చిరాగా వాసన పసికట్టి "ఇలాగైతే మీతో మాట్లాడను" అని రమ గట్టిగా చెప్పింది. వచ్చే సినిమాకల్లా వెళ్తూవుండటం, ప్రతి రోజూ రమదగ్గర అలాంటి చివాట్లు తినడమంటే చాల యిష్టంగా వుండేది నాకు. కాని అందులో నాకేదో అవ్యక్తానుభూతి కలిగేది.

కాలపరివర్తనతో బాటు నాలో అనేక కోర్కెలు తలలెత్తాయి. 'రమ'ను నాకళ్ళు వెయ్యి దృష్టులతో పరిశీలించడం అలవాటు చేసుకొన్నాయి. నాకు ఇప్పుడు క్రొత్త సమస్యలన్నీ ఉద్భవించాయి. నాలోని ఆవేదన రమకు తెలియజెయ్యాలని తహతహ జాస్తి కాజొచ్చింది.

ఒకనాడు మాటల మధ్యలో "నీ చెక్కిళ్ళు బాలు రమా!" అన్నాను. ఆమెకు కోపం వచ్చింది. "ఛీ ఛీ" అంటూ ఆమె అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయింది. నేను కొయ్యబారిపోయాను. రమ ముఖంలో అంతకోపం చూడటం అదే మొదటి సారి. నా శరీరం కంపించిపోతూంది. రమ ఇక జన్మలో నాతో మాట్లాడదేమోనని భయపడి పోయాను. అనుకున్నట్లుగా రమ నాలుగైదు రోజులు నా రూమువైపుకే తిరిగి చూళ్లేదు. నాకు అనుమానం దృఢమైంది. రమను క్షమాపణ కోరుకొందామనుకొన్నాను. ఒకనాడు కాలేజినుంచి వస్తూనే రమ యింట్లోకి వెళ్ళాను. అప్పుడే స్నానంచేసి వచ్చిందేమో అద్దంముందు చేరి తల దువ్వుకుంటూ వుంది. ఇంట్లో ఎవరున్నట్టు లేదు. నేను వెనుకగా వెళ్ళి నిల్చున్నాను. అర్ధనగ్నంగా వున్న ఆమె వేషాన్ని చూసి నాలో విషయశక్తులు ప్రకోపించాయి. వచ్చిన విషయాన్ని మర్చిపోయి ఉన్మత్తుడినవుతూ, "రమా" అంటూ వెళ్ళి ఆమె భుజాలపైన చేతులు వేశాను. అదిరిపడ్డ లేడిలా ఛెంగునలేచి పైట సర్దుకుంది రమాదేవి. నా చేతుల్లోంచి అవతలకు వెళ్ళాలని ప్రయత్నించింది. అంతలోనే ఆమెను నావైపుకు లాక్కుని చెక్కిలి గట్టిగా స్పృశించాను. నా చేతులు విడిపించుకుని దూరంగా వెళ్ళింది రమ. "ఛీ. ఇవేం పాడుబుద్ధులు, వెళ్ళండి ఇక్కడ్నుంచి" అని గట్టిగా అరిచింది.

నేనలా చెయ్యాలనుకుని రాలేదు, అంతా ఆవేశంలో అప్రయత్నంగా జరిగిపోయిందని చెబుదామనుకొన్నాను. కాని, రమలో రౌద్రాకారం చూసి మాట్లాడకుండా వచ్చేశాను.

రమమీద నాకు అపరిమితమైన జాలివేసింది. నన్నెంతో ఆదరంగా చూస్తుంది రమ. అలాంటి రమనేనా నేను అవమానించేదీ — నాలో వూహాలు పలువిధాలుగా పొయ్యాయి. ఇంక రమ ముఖం చూడలేను. రూమ్ మార్చేద్దామని కూడా నిశ్చయించాను.

రమ మాత్రం మాటలు చాలించి రెండువారాలు గడిచాయి.

ఒక పండుగరోజున రత్తమ్మ రమచేత నాకు గారెలు పంపించింది. పళ్ళెం తెచ్చి నా టేబిల్ మీద పెట్టి వెళ్ళబోయింది. "రమా!" అని పిల్చాను. ఆగింది. కాని, ఆ వైపుకు ముఖం పెట్టింది. రమ దగ్గరగా వెళ్ళి, "నామీద కోపం వచ్చిందా?" అన్నాను ఆమె కళ్ళలోకి చూస్తూ.

దూరంగా జరిగి "మీ మనసు మార్చుకున్నారా?" అని అడిగింది. నేనేమీ మాట్లాడలేదు. రమ మెల్లగా వెళ్లిపోయింది.

రమ బెంకితనం చూసినకొద్దీ నాలో పట్టుదల కూడా హెచ్చింది. ఒకనాడు ఒంటిగంట వేళ హఠాత్తుగా మెలకువ వచ్చింది. తిన్నగా రమ పడక దగ్గరికి నడక సాగించాను. మేడమీద రమ ఒక్కర్తే పడుకొని నిద్రపోతూ వుంది. లైటు ఆర్పడంకూడా మర్చిపోయింది. లైటు ఆర్పి నేను మెల్లగా రమ మంచం దగ్గరగా వెళ్లాను. మత్తులో తూలిపోతూ ఆమె పెదాలను స్పృశించాను. ఆమె కదిలింది. నేను ఆమెను వదలకపోవడం చూచి కలవరపడి అరవబోయింది. నోరుమూసి, "నేను రమా... ప్రసాద్‌ను" అన్నా. రమ నాగొంతువిని లేచి లైట్ వేసింది.

"ఎందుకొచ్చారు!" అని గద్దించింది.

"పెద్దగా అరవకు రమా, మీ అత్త వింటుంది."

"వెళ్లిపోండి. లేకపోతే నేనిప్పుడే మేడదూకి చస్తాను" అని బెదిరించింది.

"నీతో చావడానికి నేనూ సిద్ధమే రమా. నన్నెందుకు వేధిస్తావు... నిజం చెప్పు. నామీద నీకు యిష్టం లేదా?"

రమ వణికిపోతూ వుంది. "వెళ్లండి. మీకు పుణ్యం వుంటుంది" అని బ్రతిమాల్తూ అడిగింది: "ప్రసాద్ నన్ను గౌరవంగా బ్రతకనీయరా; నన్ను నాశనంచేస్తే మీకు సంతోషమా?" అని ఏడ్చింది.

"రమా... ఆ మాటనకు రమా! ఆ మాటనకు. ఈ క్షణంకోసం కాదు· నిన్ను శాశ్వతంగా నాదాన్ని చేసుకుంటాను. మనిద్దరం పెళ్లి చేసుకొందాం" అన్నాడు.

"అసంభవం. మన కులాలు, సంప్రదాయాలు వేరు ప్రసాద్. నామాట విను. వృథా ఆశలు పెట్టకు. నన్ను నలుగుర్లో తలెత్తనీకుండా చెయ్యకు" అని బ్రతిమాలింది.

రమకున్న భయాన్ని, పిరికితనాన్ని పోగొట్టేసరికి నాకు దేవుడు కన్పించాడు. ఆరోజు రమకు నాకు జరిగిన వాగ్వివాదం ఈనాటికి నా చెవుల్లో మారు మ్రోగుతూనే వుంటుంది.

నేను యూనివర్శిటీ పరీక్షలు వ్రాస్తున్న సమయంలో ఒక మంచి సంబంధం వచ్చింది. బి.యస్‌సి. చదివాడు. పరంధామయ్య అతనిని చేసుకోమని రమను పట్టుబట్టాడు. రత్తమ్మగారు కూడా ఆ సంబంధం వైపుకే మొగ్గు చూపింది. రమను కాపాడ్డానికి ఒక్కటే నాకు శరణ్యంగా తోచింది. పరీక్షలైపోయాయి. ఉత్తరదేశం ఎక్స్‌కర్షన్ వెళ్తున్నామని ఇంటినుంచి నాలుగు వందలు తెప్పించాను.

ఒకనాడు వేకువఝామున రమతో నేను నెల్లూరుకు రైలెక్కాను. నా జీవితంలో యిది ఒక నూతన సాహసం! ఒక నూతన అధ్యాయం ఆరంభమైంది.

నెల్లూర్లో యిల్లు అద్దెకు తీసుకుని క్రొత్తజీవితాన్ని ప్రారంభించాం. కాని, మా జీవితంలో వడిదుడుకులు యింకా తగ్గలేదు. మావాళ్లు నా విషయం తెలిసి నన్ను వెదకటం మొదలుపెట్టారు. ఒకసారి హఠాత్తుగా ఒకచోట మా నాన్నగారు నలుగురు పెద్దలతో బజారులో నాకు కనిపించారు. నేను చేసిన పనికి నాన్న చాల బాధపడ్డాడు. రమను వదిలెయ్యమని, వేరే మంచి సంబంధం తెస్తానని చెప్పాడు. లాభం లేదన్నాను. నాన్నకు కోపంవచ్చి నానా మాటలన్నాడు. చివరి అస్త్రంగా "పోనీ, నీ బ్రతుకెలాగో తగలడనీ - నీకోసం మీ అమ్మ ప్రాణాలు పోయేట్టున్నాయి. ఒక్కసారి చూచైనా రావూ?" అన్నాడు. దాంతో నేను కొంచెం మెత్తబడ్డాను. అమ్మ కోర్కెను ఏనాడు తృణీకరించలేదు. సరే నన్నాను. అమ్మనుచూసి వచ్చేద్దువుగాని అన్న మీదట నేను ఒప్పుకొని, యింటికెళ్లి రమతో ఈ విషయం చెప్పాను. రమ కొంచెం తటపటాయించింది. "మళ్లీ వస్తారా?" అనునయంగా అడిగింది. ఆమెకు నమ్మకం కలిగేట్టు చెప్పి, మూడు రోజుల్లో వస్తానని ప్రయాణం చేశాను.

ఊరుకి వచ్చి చూశాను. నిజంగా అమ్మ నాకోసం బాగా చిక్కిపోయి వుంది. ఊళ్లో కొందరు నన్ను వింతమృగాన్ని చూసినట్లు చూడసాగారు. అనుకున్న ప్రకారం అమ్మతో చెప్పి మూడోరోజు ప్రయాణమయ్యాను. అమ్మ ఏడ్వటం మొదలెట్టింది. ఆ ఏడ్పు నన్నూ రమనూ దూరం చేసేందుకు కారణమైంది. ఊరి పెద్దలు కొందరు నాకు హితబోధ చెయ్యడం మొదలుపెట్టారు. నా మనసు సందిగ్ధంలో పడిపోయింది. "నీతో లేచివచ్చిన పిల్ల మరొకరితో పోదని నమ్మకమేమిటి?" అని ప్రశ్నించారు. నిజ

గురూ అలా అనడంతో నేను కొంచెం మెత్తబడ్డాను. అంతే. నన్ను ఆ వాతావరణం పూర్తిగా మార్చి వేసింది, రమకు ఉత్తరం వ్రాశాను.

"విధి బలవత్తరమైంది. నన్ను క్షమించు రమా! మా అమ్మ ప్రాణాలు తియ్యలేను. నన్ను మర్చిపోవటానికియత్నించు. నీ జీవితం పాడైందని అనుకోకు. ఏ క్షణాన నీకు నా సహాయం కావాలో సిద్ధంగా వుంటాను. నీ ఆదరణను నేనెన్నటికీ మర్చిపోలేను రమా. నీకోసం వెయ్యి రూపాయలు పంపుతున్నాను" అని వ్రాశాను. కాని డబ్బు నాకు తిరిగి వచ్చింది. రమ తీసుకోలేదు.

"ఆమె ఎక్కడికి వెళ్ళిందో, ఏం చేస్తుందో, నా కేమాత్రం ఆమె జాడలు తెలియవు. నేనెంత రాక్షసుడినో యిప్పుడు అర్థమైందా ప్రభా!" అని నేను ప్రభవైపు చూశాను. ఆమె కళ్ళలో నీరు కారుతూ వున్నాయి.

కాసేపాగి, "మీరు సర్వనాశనం చేసింది నా స్నేహితురాలినే" అన్నది బాధగా ప్రభ.

"ఆఁ!...ఎవరు? నీ స్నేహితురాలా?"

"కాకినాడలో నాతో ఫోర్తుఫారం చదువుకుంది. తర్వాత వాళ్ళ అమ్మ నాన్న గతించారు. మామయ్యగారి వూరు గుంటూరుకి వెళ్ళిపోయింది. తన జీవితాన్ని గూర్చి ఎన్నో వుత్తరాలు వ్రాసింది."

"అయితే రమ యిప్పుడెక్కడుందీ?" ఆతురతగా అడిగాడు.

ప్రభ రెప్పల్లోనుంచి రెండు కన్నీటి ముత్యాలు వేడిగా జారాయి. ఆమె మౌనంగా కాసేపు వుండిపోయింది. మా నాన్ని భరించలేక బ్రతిమాలుకున్నాడు. "ఎక్కడుందో త్వరగా చెప్పవా, ప్రభా?"

తన భర్త కళ్ళలోకి చూస్తూ "జనరల్ హాస్పిటల్లో వుంది. ఉదయం వెళ్ళొచ్చాం దక్కడికే. అంతిమదశలో వుంది. డాక్టరు ఫర్వాలేదంటున్నాడు" అంది ప్రభ.

రేగిన జుత్తుతోనే లేచాడు. వెఱ్ఱిగా గుమ్మం వైపుకు నడిచాడు. భర్తనుచూసి ప్రభ అదిరిపోయి ధైర్యం చిక్కబట్టుకుని భర్తనంటి నడిచింది. బండి కోసం చూచాడు.

జట్కా వార్డుముందు ఆగింది. లోపలికి దారితీసింది ప్రభ. మెట్లవైపు నడిచి అక్కడ్నుంచి ప్రక్కవైపుగానున్న సందుగుండా లోపలికి వెళ్ళింది. ప్రసాదు వణుకుతున్న కాళ్ళతో వెంబడించాడు.

రమ తను రావల్సిన గది తప్పిపోయి వచ్చిందేమో నని భయపడింది. చూడవలసిన రూపానికి బదులు మరొకరూపం ఆ మంచంలో కన్పించింది. వృద్ధురాలు దగ్గరికొచ్చి, "ఇంకెందుకమ్మా, ఏడిస్తే వస్తుందా నాయనా. ఇదిగో, ఈ చీటీ నీ కిమ్మంది తల్లీ" అని ఓదార్పు చెప్పింది. ప్రభ వుత్తరం చదువుకుంది.

"ప్రభా - ఇదే నా చివరి వుత్తరం. నా జీవితం ఇలాగే అంతమై పోనీ. అక్కకన్నా ఎక్కువగా చూశావ్. నా పతనానికి కారకురాల్ని నేనే. తప్పంతా నాదే _ మీ శిశువుకు నా పేరు పెట్టావు కదూ _ ఈ బీదరాలిని తల్చుకొంటూ వుండు _ వెళ్తున్నా చెల్లీ" అని చదువుకుని "అక్కా" అంటూ చేతుల్లో ముఖం దాచుకుని ఏడ్చింది ప్రభ.

ఆ వార్డంతా ఈ దృశ్యం చూస్తున్నారు. ప్రసాద్‌కు తన కాళ్ళక్రింద భూమి బ్రద్దలై కంపించినట్లయింది. స్వయంగా ఆలోచించే స్థితి తప్పింది సవ్వడి గుర్తించి కళ్ళు తెరిచింది ప్రభ. పిచ్చిగా తల బాదుకుంటూ తూలిపోతున్న భర్తను చూసి వణికిపోయింది. ఏడ్పు నిలద్రొక్కుకుని వెళ్ళి పట్టుకుంది. క్షణంపాటు యిక్కడుంటే భర్తకు ప్రమాదం కలుగవచ్చని మెల్లగా తీసుకెళ్ళి జట్కా ఎక్కించింది.

వాళ్ళ కళ్ళతడిలోనే ఆసుపత్రి దూరమైపోయింది